VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 326
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శనివారం 16 మే 2026

# రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు


● ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఆమ్కా ప్రాజెక్టు ముందడుగు ● 36 రోజుల్లో జెట్ స్పీడ్ లో ఈ ప్రాజెక్టుకు అనుమతులు ● ప్రధాని మోదీ ఇచ్చిన పాదుపు ఉద్యమానికి ఏపీ సారధ్యం ● త్వరలో బంగారం ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ● కేంద్ర మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌తో కలిసి ఆమ్కా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు ● ఏపీ అంటే అడ్వాన్స్‌ప్రదేశ్ : రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కితాబు






**పుట్టపర్తి,కలంకౌంటర్ :** అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు సహా వివిధ డిఫెన్సు యూనిట్లతో దేశానికి రక్షణ కవచంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని ఆమ్కా ప్రాజెక్టుతో ప్రధాని మోదీ ఆశిస్తున్న ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆమ్కా ప్రాజెక్టు సహా ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. డీఆర్డీఓలో భాగమైన ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఇరువురు నేతలు ఆవిష్కరించారు. త్రివిధ దళాలకు రక్షణ ఉత్పత్తులను తయారు చేయనున్న కల్యాణీ స్ట్రాటజిక్ సిస్టమ్స్ ఆధ్వర్యంలోని ఆగ్నేయాస్త్ర ఎనర్జిటిక్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్ సీఎల్ ప్రాజెక్టుల శిలాఫలకాలను కేంద్ర మంత్రితో కలిసి సీఎం ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని డ్రోన్ సిటీలో ఏర్పాటు కానున్న 5 డ్రోన్ తయారీ, టెక్నాలజీ కంపెనీలను కూడా వర్చువల్ గా శంకుస్థాపన చేశారు.



అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..." సత్యసాయి బాబా బోధనలతో ఈ ప్రాంతం నుంచి విశ్వ శాంతికి బాటలు పడ్డాయి. ఇప్పుడు పుట్టపర్తిలో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకంగా మారింది. దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. ఆమ్కా ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుంది. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారు. ఆధునిక తరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ఆవీజూా ప్రాజెక్టు ఏర్పాటు అవుతోంది. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. ఆపరేషన్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, టెస్ట్ చేశారు. AMCA లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుంది. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాయి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రోజుల వ్యవధిలోనే అమ్కా ప్రాజెక్టు సాకారం..** "కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులిచ్చామని సీఎం వివరించారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ఈ ప్రాజెక్టుతో పాటు మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు

# ప్రశాంతి నిలయాన్ని సందర్శించిన చంద్రబాబు, రాజ్ నాథ్ సింగ్





**పుట్టపర్తి,కలంకౌంటర్ :** పుట్టపర్తి పర్యటనలో భాగంగా ప్రశాంతి నిలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని సీఎం, కేంద్రమంత్రి దర్శించుకున్నారు.

# మొదటి ఏడాది లోనే ఓ అండ్ ఎం పనులకు 708 కోట్లు

● మూడో విడత లో 397 కోట్ల తో పనులు
● జూన్ మొదటి వారం లోగా కాలువల తవ్వకం పనులు పూర్తి చేయాలి
● మంత్రి నిమ్మల రామానాయుడు



**విజయవాడ,కలంకౌంటర్ :** ఐదేళ్ల జగన్ అరాచక పాలనలో కాలువల వ్యవస్థ అస్తవ్యస్తమైపోయిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవేదన చెందారు. నిర్వహణ పనులు నీటికి వదిలేసారని ఆయన ధ్వజమెత్తారు. ఓఅండ్ఎం పనులు, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి పై ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి సంవత్సరంలోనే రెండు విడతలుగా ఓఅండ్ఎం పనుల కోసం708 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నేడు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి అత్యవసర, మరమ్మత్తులు పనుల కోసం 397 కోట్లు కేటాయించా మన్నారు. గత 5ఏళ్ళ వైసిపి పాలనలో కాలువల్లో తూడు,గుర్రపుడెక్క, పూడికతీత వంటి కనీస నిర్వహణ పనులు చేయలేదన్నారు. ఆ కారణంగానే అన్నదాతలకు అపార నష్టం జరిగిందన్నారు. అత్యవసర పనులు కోసం 10లక్షలు దాటితే, కాలయాపన లేకుండా, 7 రోజుల్లోనే షార్ట్ టెండర్లు పిలిచేలా కేబినెట్ ఆమోదించిన విషయాన్ని తెలియజేశారు. మొత్తం 6,502 పనుల్లో 5,943 పనులు సుమారు 91 శాతం సాగు నీటి సంఘాల ద్వారానే పనులు జరుగనున్నాయని వివరించారు. ఖరీఫ్ నాటికి ఓఅండ్ఎం పనులు పూర్తిచేసేలా సిఈ స్థాయి నుండి కిందిస్థాయి అధికారులు వరకు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఓఅండ్ఎం పనులకు సంబంధించి, ప్రతి వారం, పనుల వివరాలు, వర్క్ ప్రోగ్రెస్ రిపోర్టు అందించాలని నిమ్మల ఆదేశించారు. జలధారకు, ఓఅండ్ఎం పనులను కూడా సమన్వయం చేసి, భూగర్భ జలాలు పెంచడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెలలో జలధారపై కేంద్ర జలశక్తి మంత్రి సి. ఆర్.పాటిల్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారుతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారన్నారు.ఈ సమీక్ష లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్, కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సి నరసింహమూర్తి, సీఈలు, ఎస్ ఈలు, ఈఈ లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మే 26న కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు

**అమరావతి,కలంకౌంటర్ :** దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడి అయిన నైరుతి రుతుపవనాలు మే 26న కేరళను తాకనున్నాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. కానీ ఈసారి ఐదు రోజుల ముందే కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఐఎండీ శుక్రవారం వెల్లడించింది. దేశంలో 50 శాతానికి పైగా సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40 శాతం దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి.

# రేపు శ్రీకాకుళం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

● నరసన్నపేటలో 'స్వర్ణాంధ్ర -
- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం




**అమరావతి,కలంకౌంటర్ :** 'స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించనున్నారు. రేపు ఉదయం 9.00 గంటలకు ఉండవల్లి క్యాంప్ ఆఫీస్ నుంచి బయలుదేరి 10.40 గంటలకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం తామ్రపల్లి చేరుకుంటారు. అనంతరం సీఎం నరసన్నపేటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 'స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు నరసన్నపేటలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ దగ్గర ప్రజలతో సమావేశమై స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రజలతో మాట్లాడనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటల నుంచి 3.40 గంటల వం-కు తామ్రపల్లి గ్రామంలో నిర్వహించే స్థానిక పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. 3.55 గంటలకు తామ్రపల్లి నుంచి తిరుగు ప్రయాణమై సాయంత్రం 5.35 గంటలకు ఉండవల్లి క్యాంప్ ఆఫీసుకు చేరుకుంటారు. రాష్ట్రంలో గత 16 నెలలుగా ప్రతీ నెలా 3వ శనివారం రాష్ట్ర ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, పర్యావరణం వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారు.

# గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ.. పవన్ కల్యాణ్ ప్రశంసలు

● పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
● చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్
● పారిశ్రామికంగా ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో నిలిపే దిశగా రూ. 15,803 కోట్ల భారీ పెట్టుబడితో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ పారిశ్రామిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో ఏర్పాటు కాబోతున్న 'ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్' దేశ రక్షణలో కీలకం కానుంది. స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా' ప్రాజెక్టులో ఏపీ భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7,500 మంది యువతకు హై-వాల్యూ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేవలం విమానాల తయారీ మాత్రమే కాకుండా, రాష్ట్రంలో అత్యాధునిక 'డ్రోన్ ఎకో సిస్టమ్'ను అభివృద్ధి చేయడం ద్వారా డ్రోన్ టెక్నాలజీలో కూడా ఏపీ అగ్రగామిగా నిలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.



- 2లో

సీఎం క్యాంప్ కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో ముఖ్యమంత్రి సమావేశం..

## 10 కిలోమీటర్లు సైకిల్ తొక్కిన మంత్రి నిమ్మల





**అమరావతి,కలంకౌంటర్ :** జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నో వెహికల్ డే సందర్భంగా విజయవాడ క్యాంపు కార్యాలయం నుండి ఉండవల్లి సిఎం క్యాంపు కార్యాలయం వరకు సైకిల్ తొక్కుకుంటూ వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు. మండుటెండలో దాదాపు 10 కి.మీ సైకిల్ తొక్కుకుంటూ సిఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మంత్రి నిమ్మల. సిఎం చంద్రబాబు చేతుల మీదుగా పోలవరం నిర్వాసితులకు 307 కోట్ల పరిహారం, పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సైకిల్ పై వచ్చిన మంత్రి నిమ్మల. పెట్రోల్, డీజిల్, విద్యుత్ వాడకాన్ని తగ్గించి, పొదుపు చేయాలని ప్రధాని మోధీ ఇచ్చిన పిలుపు మేరకు తన వంతు భాద్యతగా కాన్వాయ్ ని పక్కనపెట్టి సైకిల్ పై మీటింగ్ కు హజరైన మంత్రి నిమ్మల. దేశ భవిష్యత్ కోసం, భవిష్యత్ తరాల కోసం పొదుపు చేయమని ప్రధాని పిలుపు ఇస్తే, వైసిపి నేతలు అవహేళనగా మాట్లాడటం భాదాకరం.

## వినాయక సాగర్ లో ఆట వస్తువులు మరమ్మత్తు చేయండి - ఇంచార్జి కమిషనర్ శారదా దేవి



**తిరుపతి,కలంకౌంటర్ :** నగరపాలక సంస్థ పరిధిలోని వినాయక సాగర్ లో పాడైన ఆట వస్తువులను వెంటనే మరమ్మతులు చేసి పిల్లలకు అందుబాటులోకి తేవాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని రైతు బజార్, న్యూ మారుతి నగర్, రాయల్ నగర్, వినాయక సాగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులతో పాటు ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను పరిశీలించారు. నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వినాయక సాగర్ పరిశీలించి ఓపెన్ జిమ్, ఆట వస్తువులు మరమ్మత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్ ను నిబంధనల మేరకు నిర్వహణ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. మురుగునీటి శుద్ధి చేసే ప్లాంట్ ను మరింత బాగా నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఏ సి పి పార్వతి ప్రియ, డిఈ రమణ, శానిటేషన్ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

## ఫిర్యాదు..



**రాజమండ్రి,కలంకౌంటర్ :** నల్ల కిషోర్ అనే వ్యక్తి ఇంస్టాగ్రామ్ లో హిందువుల పైన,శ్రీ రాముడి పైన,సీత దేవి పైన చెప్పలేనటువంటి అసభ్య పదజాలంతో పోస్టింగ్ పెట్టడం జరిగింది. హిందూ దేవుళ్లను అవమానించే ఇటువంటి వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలనీ హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి తరపున రాజమండ్రి ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ లోఆధారాలతో సహా పిర్యాదు చేయడం జరిగింది. హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లాడి రుద్రయ్య, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వెలు గూరి రవికుమార్, ఈ విషయం పై ప్రకాష్ నగర్ సి. ఐ. బాజీలాల్ ను కలసి పిర్యాదు చేసారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు

(మొదటిపేజీ తరువాయి)

కూడా వస్తున్నాయి. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశాం. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయి. వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తితో మెం-త్తం దేశానికే రక్షణ కవచంగా ఏపీ నిలుస్తుంది. కూటమి అధికారంలోకి వచ్చాకే రాయలసీమకు నీరిచ్చి లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రాయలసీమలో ఇనుప ఖనిజం, సున్నపురాయి లాంటి ఖనిజ వనరుల్ని సమర్ధంగా వినియోగించుకుంటాం. కడప స్టీల్ ప్లాంటు 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుంది. డిఫెన్స్, స్పేస్ , ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ లాంటి పరిశ్రమలతో రాయలసీమ రతనాల సీమగా మారుస్తాం. కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మారుతుంది. తిరుపతిలో రాయల్ ఎన్ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరి కోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం. కియా పరిశ్రమ ఏటా 18 లక్షల కార్లు తయారు చేస్తోంది. కరవు సీమలో తయారైన కార్లు 80 దేశాల్లో తిరుగుతున్నాయి. రాయలసీమలోని ఆర్టీటీ సంస్థకు విదేశీ విరాళాల విషయంలో సమస్య ఉత్పన్నం అయితే కేంద్రంతో మాట్లాడి మంత్రి లోకేష్ ఆ సమస్యను పరిష్కరించారని" సీఎం వెల్లడించారు.

**గతంలో కేజీఎఫ్ ఇప్పుడు జేజీఎఫ్..** "త్వరలో కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ నుంచి బంగారం ఉత్పత్తి జరుగుతుంది. జీ+భిలో ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుంది. రెండో ఏడాది 1,500 కిలోల బంగారం తయారవుతుంది. రానున్న రోజుల్లో బంగారం ఉత్పత్తికి ఏపీ కీలకంగా మారుతుంది. సమ-ర్ధవంతమైన నీటి నిర్వహణతో జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. అభివృద్ధిని బుల్లెట్ స్పీడ్ తో తీసుకెళ్తున్నాం. అవకాశాలు తెచ్చే బాధ్యత మాది. వాటిని అందిపుచ్చుకునే బాధ్యత యువతది. గత పాలనలో విధ్వంసం చేశారు. పరిశ్రమలు తరిమేశారు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటివల్ల 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలి, ఇతరులకూ ఇక్కడే ఉపాధి కల్పించేలా పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి ప్రాజెక్టులు వచ్చాయి. రిలయన్స్, బీపీసీఎల్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి.



విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయి. చిప్ నుంచి షిప్ వరకూ మన దేశంలోనే తయారు కావాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు. ఏపీలో డిజైన్ చేయండి, పెట్టుబడులు పెట్టండి, ఉత్పత్తులు తయారు చేయండి అని పారిశ్రామిక వేత్తల్ని కోరుతున్నాను. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఏపీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం... వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశానికి తిరుగులేని శక్తిగా రాయలసీమ, ఆంధ్రప్రదేశ్ తయారవుతాయి." అని ముఖ్యమంత్రి వివరించారు.

**నాదేశం- నాబాధ్యత..** "పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడిందని...ఇంధనం, బంగారం కొనుగోలుతో విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయని సీఎం అన్నారు. దేశానికి ఆర్థిక భద్రత కూడా అత్యంత కీలకమని..ఇతర దేశాలు కూడా పొదుపు చర్యలు చేపట్టాయని తెలిపారు. ప్రధాని మోదీ ఇచ్చిన 7 అంశాలను ఆచరిద్దాం. పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ లో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నాం. దీనిపై ఓ కార్యాచరణను కూడా తీసుకువచ్చాం. వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటి అంశాలను అమల్లోకి తీసుకు రావాలని కోరుతున్నాను. ప్రతీ భారతీయుడూ ప్రస్తుత సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలి. ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారథ్యం వహించాలని" ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఏపీ ఇక అడ్వాన్స్ డ్ ప్రదేశ్- రాజ్ నాథ్ సింగ్..** ఆమ్కా ప్రాజెక్టు ఏపీ సహా దేశ రక్షణలో ఓ చారిత్రాత్మక అధ్యాయాన్ని జోడిస్తోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలతో పాటు రక్షణ రంగ పరిశ్రమల్ని ఆకర్షిస్తున్న ఏపీ పేరు అడ్వాన్స్ ప్రదేశ్ అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. 5 జనరేషన్ ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల్ని తయారు చేస్తున్న రాయలసీమను మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సుగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. రూ.15 వేల కోట్ల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఇలాంటి ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాలు కేవలం కొద్దిదేశాల వద్ద మాత్రమే ఉన్నాయని.. ఇప్పుడు భారత్ కూడా ఆ సరసన చేరిందని అన్నారు. అమ్కా ప్రాజెక్టుతో తయారైన ఆధునిక యుద్ధ విమానాలు మన రక్షణ శక్తిని చాటేలా మన గగనశక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి టేకాఫ్ అవుతాయని కేంద్ర మంత్రి వివరించారు. ఆ తరహా యుద్ధ విమానాలను పుట్టపర్తి నుంచి తయారు చేయబోతున్నామని తెలిపారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కూడా రూ.480 కోట్లతో ఆధునిక అటానమస్ అండర్ వాటర్ వ్యవస్థలను, టార్పెడోలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇప్పటి వరకూ దిగుమతి చేసుకుంటున్న చాలా పరికరాలను కూడా స్వదేశీయంగా తయారు చేసుకోగలమని చెప్పారు.

**7 సంస్థలతో ఒప్పందాలు..** అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు సమక్షంలో 7 సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. రూ. 4460 కోట్ల పెట్టుబడులు, 6400 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఈ ఒప్పందాలు కుదిరాయి. భారత్ ఫోర్జ్, రఘువంశీ మెషీన్ టూల్స్ , సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ , ఎన్ఐబీఈ గ్రూప్, పీఎంటీ డిఫెన్స్, చక్రవ్యూహ్ డైనమిక్స్ , ఇండస్ బ్రిడ్జ్ వెంచర్స్ సంస్థలు ఈ ఎంఓయూలు కుదు-ర్చుకున్నాయి. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ఆమ్కా ప్రాజెక్టులో నిర్మితం కానున్న అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ నమూనాతో పాటు భారత్ డైనమిక్స్ సహా వేర్వేరు సంస్థలు ఏర్పాటు చేసిన మిస్సైళ్లు, హ్యాండ్ గ్రెనేడ్ లు, టార్పెడో నమూనాలు, ఆధునిక తుపాకుల ప్రదర్శనను కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి సీఎం తిలకించారు. శంకుస్థాపనల కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, మంత్రులు టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్య ప్రసాద్, సవిత, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఏపీ సలహాదారు సతీష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# చేప మందు పంపిణీకి అగర్వాల్ సమాజ్ చేయూత

### -తెలంగాణ అగర్వాల్ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గోయల్





**హైదరాబాద్,కలంకౌంటర్ :** చేప మందు పంపిణీకి తెలంగాణ అగర్వాల్ సమాజ్ చేయూత అందించనుంది. హైదరాబాద్‌లో బత్తిని సోదరులు ఇచ్చే ప్రసిద్ధ చేప మందు పంపిణీ ప్రతి ఏటా మృగశిర కార్తె రోజున ప్రారంభమవుతుందని తెలంగాణ అగర్వాల్ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గోయల్ వెల్లడించారు. తమ సమాజ్ సభ్యులు స్వచ్ఛందంగా ఇందులో పాల్గొంటారని చెప్పారు. చేప ప్రసాదం పంపిణీ కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గోయల్, శ్వాసకోశ వ్యాధులు, ముఖ్యంగా ఆస్తమా నివారణకు ఈ మందును వేలాది మంది ప్రజలు తీసుకుంటారన్నారు. జూన్ 8 , 9 తేదీల్లో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఉదయం 8:30 గంటలకు ప్రారంభమై, మరుసటి రోజు రాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని వివరించారు. భక్తుల సౌకర్యార్థం దాదాపు 32 నుండి 34 ప్రత్యేక కౌంటర్లు, 40కి పైగా క్యూలైన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ కేంద్రం వద్దే చేప పిల్లలను విక్రయిస్తారని, పంపిణీ ప్రాంతంలో వెటర్నరీ వైద్యులు, మత్స్యశాఖ నిపుణులు పర్యవేక్షణలో ఉంటారని వివరించారు. ఈ సమావేశంలో మున్నలాల్ అగర్వాల్, చైర్మన్ , సలహాదారు సురేష్ అగర్వాల్, గోపాల్ మోర్, ఉపాధ్యక్షుడు సీఏ హరిగోవింద్ ప్రసాద్, కార్యదర్శి సీమా జైన్, కోశాధికారి సీఏ రాంగోపాల్ అగర్వాల్, మాజీ అధ్యక్షులు ఆర్.ఎన్.గుప్తా, మాజీ అధ్యక్షులు సురేష్ సింఘాల్, బత్తిని కుటుంబం నుంచి బత్తిని అమర్ నాథ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్ , చంద్ర శేఖర్ గౌడ్ , షావ శంకర్ గౌడ్, సంతోష్ గౌడ్, అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**జూన్ 8న చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం సిద్ధం :** ప్రతి ఏటా మృగశిర కార్తె రోజున బత్తిన సోదరుల కుటుంబం అందించే చేప ప్రసాదానికి దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉంది. ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఈ ప్రసాదం కోసం వేల సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివస్తారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీన నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ పంపిణీ కార్యక్రమం ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పంపిణీ సమయం, క్యూలైన్ల నిర్వహణపై అధికారులు ఇప్పటికే ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేశారు.

**1.25 లక్షల చేప పిల్లలు సిద్ధం :** ఈ కార్యక్రమం కోసం మత్స్యశాఖ ద్వారా సుమారు 1.25 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచుతున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అవసరమైతే ఈ సంఖ్యను మరింత పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ చేప పిల్లలను భక్తులకు సరఫరా చేసే క్రమంలో ఎక్కడా జాప్యం జరగకుండా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పంపిణీ జరిగే ప్రాంతంలో వెటర్నరీ వైద్యులు, మత్స్యశాఖ నిపుణులు నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోనున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పోలీస్, ట్రాఫిక్ విభాగం పార్కింగ్ , భద్రతను పర్యవేక్షించగా, జీహెచ్ఎంసీ పారిశుధ్య పనులను, రెవెన్యూ, ఆర్ అండ్ బీ విభాగాలు వసతి కల్పనను చూసుకోనున్నాయి. ఎండ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, అత్యవసర వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీని బట్టి అదనపు బస్సులు, మెట్రో సర్వీసులను నడిపేలా రవాణా శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

# అచ్చ ప్రాజెక్టుతో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యా విప్లవానికి శ్రీకారం

- అంగన్వాడీ కార్యకర్తలే ప్రభుత్వ పథకాల అసలైన బలస్తంభాలు
- తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాల్సిన ఆవశ్యకత ఉంది
- స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేయాలి
- మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. సూర్య కుమారి

**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రలో చిన్నారుల చదువులు (అచ్చ) ప్రాజెక్టుతో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యా విప్లవానికి నాంది పలుకుతుందని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. సూర్య కుమారి తెలిపారు. స్థానిక ఇరిగేషన్ కాంపౌండ్ కార్యాలయంలోని ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్ లో అచ్చ (ఆంధ్రాలో చిన్నారుల చదువులు) ప్రాజెక్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. సూర్య కుమారి లాంఛనంగా పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. సూర్య కుమారి మాట్లాడుతూ... అంగన్వాడీ కార్యకర్తల సేవలను అభినందిస్తూ, వారి సవాళ్లను, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. రాష్ట్రంలో ఏ పథకం అమలు కావాలన్నా, చిట్టచివరి లబ్ధిదారునికి చేరడంలో అంగన్వాడీ కార్యకర్తలే ప్రధాన భూమిక పోషిస్తారని ఆమె కొనియాడారు. ఒక రోజు అంగన్వాడీ కార్యకర్తగా నేను అని చెపుతూ... సెక్రటరీ హోదాను పక్కన పెట్టి, ఒక రోజు అంగన్వాడీ కార్యకర్త ఎదుర్కొనే రోజువారీ కష్టాలను (పిల్లలను తీసుకురావడం, వంట చేయడం, డేటా అప్‌లోడ్ చేయడం, తల్లిదండ్రులను ఒప్పించడం) ఆమె కళ్ళకు కట్టినట్లు వివరించారు. మారుతున్న సామాజిక దృక్పథం... గతంలో ఆసుపత్రి ప్రసవాల పట్ల ఉన్న భయాందోళనలు ఇప్పుడు పోయి, నూరు శాతం (100%) ఆసుపత్రి ప్రసవాలు జరుగుతున్నాయని, అదే విధంగా అంగన్వాడీ ల పట్ల కూడా నమ్మకం పెరగాలని ఆకాంక్షించారు. అంగన్వాడీ సెంటర్లో అక్కడక్కడా మౌలిక సదు-పాయాల కొరత (టాయిలెట్లు, తాగునీరు) ఉన్నప్పటికీ మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. సుమారు 11-12 లక్షల మంది పిల్లలు రావాల్సి ఉండగా, ప్రస్తుతం 8-8.5 లక్షల మందే అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్నారని, ఈ సంఖ్య క్రమేపీ పెరగాలని పేర్కొన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు (సృజన ఫౌండేషన్, క్రిస్ప్ ఫౌండేషన్) విడివిడిగా కాకుండా, ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఒకే రకమైన శిక్షణను (Uniformity) అందించాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల ఎదుగుదలలో భాగస్వాములు కావాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ పిల్లలతో సమయం గడపాలని, అది వారి బాధ్యత అని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ వంటి చర్యల ద్వారా అంగన్వాడీ ల పనిభారం తగ్గుతుందని, హెల్పర్లను కూడా విద్యాబోధనలో భాగస్వాములను చేయాలని సూచించారు.





అంగన్వాడీ కార్యకర్తలు కేవలం ఐసీడీఎస్ కే పరిమితం కాకుండా ఆశా, ఏఎన్ఎం, గ్రామ సర్పంచ్‌లతో కలిసి పనిచేసి బెస్ట్ అంగన్వాడీ గా నిలవాలని ముఖ్య కార్యదర్శి ఏ. సూర్యకుమారి పిలుపునిచ్చారు.

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ....**అంగన్వాడీ చిన్నారుల కోసం ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని రెండు ఆస్పిరేషన్ బ్లాక్స్ (పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం) మినహాయించి, మిగతా చోట్ల అంగన్వాడీల పనితీరులో గణనీయమైన మార్పు కనిపిస్తోందని చెప్పారు. నీతి ఆయోగ్ సహకారంతో వెనుకబడిన బ్లాక్స్‌లో కూడా అభివృద్ధి సాధిస్తామని, చిన్నారులు మంచి పౌరులుగా ఎదిగేలా తమ టీం మొత్తం కృషి చేస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు సహకరిస్తున్న గేట్స్ ఫౌండేషన్, సుజన ఫౌండేషన్ మరియు ఇతర భాగస్వాములకు జిల్లా కలెక్టర్ డా లక్షిశా కృతజ్ఞతలు తెలియజేశారు.

**మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎమ్. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ....** రాష్ట్రవ్యాప్తంగా 55,746 అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, ముందస్తు బాల్య విద్య (Early Childhood Education) వంటి సేవలు అందుతున్నాయన్నారు. 1975 లో ఐసిడిఎస్ (ICDS) ప్రారంభమైనప్పుడు కేవలం పోషకాహారం అందించడమే లక్ష్యంగా ఉండేదని, ముఖ్యంగా రక్తహీనత ఉన్న మహిళలకు, పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. చిన్నారుల్లో 6 ఏళ్ల లోపు 85% మెదడు అభివృద్ధి చెందుతుందని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. అందుకే శారీరక,మానసిక ఎదుగుదలకు ఈ వయస్సు చాలా కీలకమని ప్రభుత్వం గుర్తించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అంగన్వాడీల ద్వారా అర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (EC-CE) ను బలోపేతం చేస్తున్నామన్నారు.'అచ్చ' (ఆంధ్రాలో చిన్నారుల చదువు) ప్రాజెక్ట్ ఇది కేవలం ఒక ప్రోగ్రామ్ మాత్రమే కాదని, ఒక మార్పుకు నాంది (Transformative Initiative) అని అన్నారు. అంగన్వాడీల్లో విద్య నాణ్యతను పెంచడం, కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించడం ఆటపాటల ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి కలిగించేలా ఈ ప్రాజెక్ట్ రూపొందించబడిందన్నారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆర్థికంగా, సాంకేతికంగా సహకరిస్తున్న అన్ని సంస్థలకు, ప్రతినిధులకు డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. క్రిస్ప్ (CRISP) ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి మాజీ ఐఏఎస్ అధికారి రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. క్రిస్ప్ ఫౌండేషన్ ద్వారా దేశంలో 14 రాష్ట్రాల్లో విద్యా సంబంధ కార్యక్రమాల్లో పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూడా అంగన్వాడీ కేంద్రాల్లోని ప్రీప్రైమరీ లెవల్ విద్యార్థులకు సంబంధించి సహకారం అందిస్తున్నామన్నారు. ముందుగా అచ్చ ప్రాజెక్ట్ కు సంబంధించిన లోగో, బ్రోచర్స్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ కె. ప్రవీణ, ఆర్జేడీ పి.సుజాత రాణి, ఏడీ స్వరాజ్య లక్ష్మి, ఐసీడీఎస్ డైరెక్టరేట్ కు చెందిన ఉదయలక్ష్మి, రాజా రాణి, ఎన్టీఆర్ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుక్సానా భేగం, నోడల్ ఆఫీసర్ సీహెచ్. సాయి గీత, క్రిస్ప్ (CRISP) ఫౌండేషన్ వ్యవస్థాపకులు కే. సంధ్యా రాణి, సుజనా ఫౌండేషన్ కు చెందిన శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, వివిధ ఎన్జీవో సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం క్యాంప్ కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో ముఖ్యమంత్రి సమావేశం..



**అమరావతి, కలంకౌంటర్ :** పోలవరం నిర్వాసితులకు రూ. 306.61 కోట్ల పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అందించిన సీఎం చంద్రబాబు. పలువురు లబ్దిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీలకు సంబంధించి ఇళ్ల తాళాలను అందించిన సీఎం. ఇళ్ల పట్టాల నిమిత్తం 62.05 ఎకరాలు, ల్యాండ్ టూ ల్యాండ్ కింద 520.02 ఎకరాలను గుర్తించినట్టు అధికారుల వెల్లడి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగోసారి పరిహారాన్ని అందించిన ముఖ్యమంత్రి. 2025 సంక్రాంతి, దీపావళి సందర్భంగా రెండుసార్లు, ఈ ఏడాది ఉగాది సందర్భంగా మూడోసారి, ఇవాళ కాటన్ జయంతి సందర్భంగా నాలుగోసారి పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించిన ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం వచ్చాక 29,936 మంది నిర్వాసితులకు సుమారు రూ.2,250 పరిహారం చెల్లింపు సమావేశం సందర్భంగా పోలవరం నిర్వాసితులతో ముఖ్యమంత్రి ముఖాముఖి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద... తమకు అందే పరిహారం మీద నమ్మకం కలిగిందన్న నిర్వాసితులు. నిర్వాసితులకు డబ్బులివ్వలేనని... తాను ఏం చేయలేనని నాటి సీఎం జగన్ చెప్పడంతో తాము ఆందోళన చెందామన్న పోలవరం నిర్వాసితులు. ఆర్ అండ్ ఆర్ కాలనీలకు గత ప్రభుత్వం రోడ్లు కూడా వేయలేదని చెప్పిన పలువురు ముంపు గ్రామాల ప్రజలు. గత ప్రభుత్వ హయాంలో వరదల సమయంలో సర్వం కోల్పోయిన తమకు కనీసం బియ్యం పంపిణీ కూడా చేపట్టలేదని సీఎంకు వివరించిన నిర్వాసితులు. హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో కూడా గత పాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని వెల్లడించారని సీఎంకు వివరించిన ముంపు గ్రామ వాసులు. కూటమి ప్రభుత్వం వచ్చిన 23 నెలల్లోనే 4 విడతలుగా పరిహారాన్ని అందించారని సంతోషం వ్యక్తం చేసిన నిర్వాసితులు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కాటన్ జయంతి రోజున పోలవరం నిర్వాసితులతో సమావేశం కావడం... ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నిధులు ఇవ్వడం ఆనందంగా ఉంది. సంక్రాంతి, దీపావళి, ఉగాది ఇలా పండుగలకు పోలవరం నిర్వాసితులకు నిధులు అందిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కమిట్మెంట్ ఉంది... నిర్వాసితుల మీద అభిమానం ఉంది. ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదు.. ఇబ్బందులు పడకూడదనేదే నా ఆలోచన. నిర్వాసితులకు ఇబ్బందిలేకుండా చేసేందుకే పోలవరం జిల్లా ఏర్పాటు చేశాం. టెక్నాలజీ అనుసంధానం చేసి ప్రతీ కుటుంబ ఆదాయం పెంచుతాం. గిరిజన నియోజకవర్గాలైన పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలను అన్ని విధాలా తీర్చిదిద్దుతాం. పోలవరం ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తవుతుంది. ర్వాసితుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగదు. ప్రాజెక్టు, టౌన్ షిప్, ఇండస్ట్రీ...ఇలా ఏం వచ్చినా భూములు త్యాగాలు చేసేది రైతులే. వారసత్వంగా వచ్చిన భూములు పోతే బాధపడతారు... నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వను. గోదావరి కావేరి నదుల అనుసంధానం జరుగుతుంది. గంగా -- కావేరి నదుల అనుసంధానం కావాలనేది నా కల. ఇది చేస్తే దేశంలో నీటి ఎద్దడి అనేది ఉండదు. రంపచోడవరంలో నియోజకవర్గంలో బ్రహ్మాండమైన రోడ్లు నిర్మిస్తున్నాం. 2022లో వరదల సమయంలో పోలవరం ముంపు ప్రాంతంలో పర్యటించాను. వరద బాధితులకు కనీసం భోజనం, నీళ్లు కూడా నాటి ప్రభుత్వం ఇవ్వలేదు. విశాఖలో హుద్ హుద్ వచ్చినప్పుడు వారం రోజులు అక్కడే ఉండి పరిస్థితి చక్కదిద్దాం.2019 తర్వాత కూడా మా ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం 2020కే పూర్తయ్యేది. గత ప్రభుత్వ నిర్వాకం, నిర్లక్ష్యం వల్ల డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోయేలా చేశారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం పెంచుతామని హామీ ఇచ్చి మిమ్మల్ని మోసం చేశారు. గత పాలకులు అధికారులను మార్చారు... కాంట్రాక్టరును మార్చారు... ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాం... 2027 పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకిత చేస్తాం.

# ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ మరియు వేసవి ఏర్పాట్ల పరిశీలన..








**విజయవాడ,కలంకౌంటర్ :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానానికి శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేసవి కాలం దృష్ట్యా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో, ఉదయం నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు భక్తుల రద్దీ అత్యధికంగా కొనసాగింది. అయితే, మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత ఎండ తీవ్రత పెరగడంతో భక్తుల తాకిడి క్రమంగా తగ్గింది. ఆలయ సంప్రదాయాల ప్రకారం మరియు భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు, ఈరోజు ఉదయం 10:30 గంటలకు అంతరాలయ దర్శనాన్ని నిలిపివేశారు. తిరిగి మధ్యాహ్నం 1:40 గంటలకు అంతరాలయ దర్శనాన్ని పునఃప్రారంభించి భక్తులను అనుమతించారు.

**ఈఓ పర్యవేక్షణ మరియు ఆదేశాలు:** దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఇూా) స్వయంగా ఆలయ క్యూలైన్లను సందర్శించి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, దర్శనం సజావుగా సాగేలా చూడాలని సిబ్బందికి "పక్కా" ఆదేశాలు జారీ చేశారు. మ-ఖ్యంగా వేసవి ఎండల దృష్ట్యా క్యూలైన్లలో ఉన్న భక్తులకు నిరంతరం మంచినీరు, మజ్జిగ సరఫరా చేయాలని మరియు ఎండ నుండి రక్షణకు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లను పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి, భక్తులతో మర్యాదపూర్వకముగా వ్యవహరిస్తూ దర్శనం త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని ఈఓ స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

# 50 ఏళ్ల భోజరాజపురం రహదారి కల నెరవేర్చిన మంత్రి కొండపల్లి

- రాజకీయాలకు అతీతంగా భోజరాజపురం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించిన మంత్రి
- ఐదు దశాబ్దాలగా తమ గ్రామానికి రహదారి లేదంటూ ఎన్నికలు బహిష్కరించిన గ్రామస్తులు
- రహదారిని నిర్మించిన తర్వాతే గ్రామంలో అడుగుపెడతానని శపథం చేసిన మంత్రి కొండపల్లి
- శపథం మేరకు హామీని నెరవేర్చి నేడు రోడ్డును ప్రారంభించిన మంత్రి
- దశాబ్దాల కలను నెరవేర్చిన మంత్రి కొండపల్లికి ఘన స్వాగతం పలికిన భోజరాజపురం గ్రామస్తులు




**విజయనగరం,కలంకౌంటర్ :** గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలంలో భోజరాజపురం గ్రామస్తుల దశాబ్దాల కలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నెరవేర్చారు. గత ఐదు దశాబ్దాలకు పైగా ఈ గ్రామానికి రాహదారి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామంలో 250 మందికి పైగా జనాభా ఉంటారు. చిన్న గ్రామం కదా ? ఇక్కడ అభివృద్ధి చేస్తే ఎంత... చేయకపోతే ఎంత ? అన్న నిర్లక్ష్యంతో ఈ ప్రాంతంలో ఏళ్ల నుంచి ఎన్నికవుతున్న ప్రజాప్రతినిధులు అందరూ గ్రామంపై పూర్తిగా శీతకన్ను వేశారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికలకు ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ గ్రామానికి రావడం రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడం, శంకుస్థాపన చేయడం... రహదారి కలగానే మిగిలిపోవడం ఆనవాయితీగా వస్తోంది. గత సాధారణ ఎన్నికలకు ముందు సైతం గ్రామస్తులు తమకు రహదారి సౌకర్యం ఐదు దశాబ్దాలుగా లేదంటూ.. పోలింగ్ బహిష్కరిస్తామని చెప్పి ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. చివరికి నాడు ఓ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండపల్లి సైతం తాను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తానని మాట ఇచ్చారు. నేడు ఆ మాటను నిలబెట్టుకుంటూ రు. 2 కోట్లతో ఈ రహదారి నిర్మాణం పూర్తిచేసి శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. కొండపల్లి గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గారు దృష్టిలో ఈ రహదారి సమస్య పెట్టడంతో పాటు పదే పదే ఫాలోప్ చేస్తూ పట్టువదలని విక్రమార్కుడిలా రహదారి నిర్మాణం పూర్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా మంత్రి ఈ పని చేయడం పట్ల గ్రామంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. రహదారి నిర్మించిన తర్వాతే గ్రామంలో అడుగుపెడతానని శపథం చేసిన మంత్రి ఈ రోజు రహదారి ప్రారంభోత్సవానికి వెళ్లగా గ్రామస్తులు మేళతాళాలతో భారీగా స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఐదు దశాబ్దాల తమ కలను మంత్రి శ్రీనివాసుడు నెరవేర్చారని.. ఇలాంటి పట్టుదల ఉన్న నాయకుడిని ఇన్నేళ్లలో తాము ఎప్పుడూ చూడలేదంటూ గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు. 50 ఏళ్లుగా రహదారి లేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు, ఆవేదన చూశాకే ఈ గ్రామానికి రహదారి నిర్మించాలని నిర్ణయించుకున్నానని.. ఈ రోజు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని భోజరాజపురానికి రోడ్డు వేయించడం సంతృప్తిగా ఉందని మంత్రి కొండపల్లి తెలిపారు.

# కర్లపాటి ట్రస్ట్ సహకారంతో ఉన్నత విద్య అభ్యాసం , ఉన్నత ఉద్యోగం సాధించిన చరణ్ దీప్ గుప్తా

- కృతజ్ఞతలు తెలుపుతూ ట్రస్ట్ కు లేఖ రాసిన తల్లి కళ్యాణి
- సేవే మార్గం సహకారమే ట్రస్ట్ లక్ష్యం అన్న కర్లపాటి ట్రస్ట్ నిర్వాహకులు కర్లపాటి శ్రీనివాసరావు



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అండతో చదువును కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యార్థి చరణ్ దీప్ గుప్తాఎం.ఎస్.సి కంపెనీలో హార్డ్ వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగాన్ని సాధించారు. సామాజిక సేవలో నిరంతరం ముందుండే కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ మరో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజిక వేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. పేద విద్యార్థులకు అండగా నిలిచి, వారి చదువులకు ఆసరా కల్పించాలనే ధ్యేయంతో ట్రస్ట్ చేస్తున్న కృషికి నిదర్శనంగా నేడు చరణ్ దీప్ గుప్తా అనే విద్యార్థి ఘన విజయం అన్నారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ చరణ్ దీప్ గుప్తా అనే విద్యార్థి ఆర్థిక ఇబ్బందుల వల్ల తన పైచదువులను కొనసాగించలేని స్థితిలో ఉన్నప్పుడు, కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అతనికి చేయూతనిచ్చింది. బి.టెక్ పూర్తి చేయడానికి అవసరమైన పూర్తి ఆర్థిక సహాయాన్ని దాతల ద్వారా అందించి, అతనికి అండగా నిలిచింది. ట్రస్ట్ అందించిన ఈ ప్రోత్సాహంతో చరణ్ దీప్ తన చదువును విజయవంతంగా పూర్తి చేసి, నేడు ప్రతిష్టాత్మకమైన ఒక మల్టీ నేషనల్ కంపెనీ లో ఉద్యోగాన్ని సంపాదించాడని తెలిపారు. ఈ సందర్భంగా చరణ్ దీప్ గుప్తా మరియు అతని తల్లి కళ్యాణి లు ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియచేస్తూ పంపిన కృతజ్ఞతా లేఖను ప్రెస్ కి అంద జేశారు. "తమ కష్ట కాలంలో అండగా నిలిచి, చదువుకు ఆసరా ఇచ్చిన కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము" అని వారు భావోద్వేగంతో పేర్కొన్నారు. ట్రస్ట్ ప్రతినిధి కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "ఒక విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగి, తన కుటుంబాన్ని ఆదుకునే స్థితికి రావడం మా ట్రస్ట్‌కు దక్కిన అతిపెద్ద గౌరవం అన్నారు . భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు ఇలాంటి సహాయ సహకారాలు అందిస్తాం" అనితెలిపారు.

# బడి బయట పిల్లల్ని బడిలో చేర్పించాలి -జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**విజయవాడ, కలంకౌంటర్ :** ప్రతి చిన్నారి విద్యాభ్యాసం ద్వారా ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని,బడి బయట పిల్లల్ని తప్పనిసరిగా బడిలో చేర్పించా లని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. మండలంలోని కుంటముక్కల గ్రామంలో జరిగిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తో కలిసి పాల్గొన్నారు.బడిలో చేరిన చిన్నారులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీయూపీ, జెడ్పి ఉన్నత పాఠశాలలను సందర్శించి పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఉత్సాహవంతంగా నిర్వహిస్తున్నా మని తెలిపారు.పాఠశాల వయసు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, డిజిటల్ విద్యా సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వంటి సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.ఇలాంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నతంగా ఎదిగేలా ప్రోత్సహించేందుకు అవగాహన ర్యాలీలు, ఇంటింటి ప్రచారం ద్వారా తల్లిదండ్రుల్లో విద్యపట్ల చైతన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యా నాణ్యత కు ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలే అందుకు నిదర్శనమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.రమేష్ బాబు,విద్యాశాఖ అధికారులు బండి రాజు, యం.వీరాస్వామి, ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు పరిధిలోని జి.కొండూరు సెక్టార్ సూపర్వైజర్ డి.జోజి కటాక్షం, అంగన్వాడీ కార్యకర్తలు,సిఆర్ పీ లు,పాఠశాల ఉపాధ్యాయు లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం యువకుడు మృతి..

**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండల పరిధిలోని పెద్దప్రోలు శివారు కప్తాను పాలెం గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. శుక్రవారం ఉదయం సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది మోపిదేవి ఎస్ఐ గౌతమ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఘంటసాల మండలం పచ్చర్లంక గ్రామానికి చెందిన కొప్పుల అరవింద్ (18) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలిపాడు మోపిదేవి నుండి చల్లపల్లి వైపు జాతీయ రహదారిపై బైకుపై ప్రయాణిస్తుండగా బైకు కారు వ్యాను మూడు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతుడు తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆయన తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నేషనల్ హైవే 216 జాతీయ రహదారిపై ఈ మధ్యకాలంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనాలు డ్రైవ్ చేయడంతో పాటు నిద్రమత్తు మరియు ఆల్కహాల్ తీసుకున్నవారు మితిమీరిన వేగంతో జాతీయ రహదారిపై వాహనాల నడపడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి పోలీసులు రహదారులపై ప్రమాద సూచికలు ఫ్లెక్సీలు డబ్బాలు పెట్టినప్పటికీ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి కప్తాను పాలెం కసానగరం గ్రామాల పరిధిలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.

జిల్లా పోలీస్ అధికారులు స్పందించి జాతీయ రహదారి కప్తాను పాలెం కాసానగరం గ్రామాల మధ్యలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని వాహనదారులను నియంత్రించాలని అతివేగంతో వెళ్లిన వాహనదారులకు జరిమానా విధించాలని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు ప్రజలు కోరుతున్నారు.

# నా దేశంబినా భాధ్యత నినాదంతో ముందుకు సాగాలి-రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రజలందరూ నా దేశం నా బాధ్యత అనే నినాదంతో ముందుకు సాగాలని రాష్ట్ర గనులు భూగర్భనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమానికి మంత్రి రవీంద్ర సైకిల్ పై వచ్చారు ప్రధాని పిలుపుమేరకు ఆయన ఇంటి వద్ద నుంచి కార్యాలయానికి సైకిల్ మీద వచ్చి ప్రజానీకానికి తన సంకేతాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధ నేపథ్యంలో దేశంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైతున్న దృష్ట్యా ముందస్తుగానే ప్రజల్ని అప్రమత్తం చేసిన ప్రధాని పిలుపును అందరూ గౌరవించాలన్నారు. దానిలో భాగంగానే ఇందనంతో పాటు వంటనూనె గ్యాస్ తదితర ఖర్చులన్నింటిని పరిమితం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం తమ కాన్వాయ్ లను తగ్గించుకొని ఖర్చును ఆదాసేస్తున్నట్టు తెలిపారు. దాంట్లో బాగానే ఈరోజు ప్రజా దర్బార్ కు సైకిల్ పై హాజరు కావడం జరిగిందన్నారు

# రాష్ట్రంలో ఎక్కడా లేని విద్యుత్ కోత, మంచినీటి కోత మచిలీపట్నంలో ఎందుకు??? - లంకిశెట్టి బాలాజీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా గత 15 సంవత్సరాలుగా మచిలీపట్నంలో ఉదయం గంటసేపు విద్యుత్ కోతలు విధించడం రోజు విడిచి రోజు 40 నిమిషాలు మాత్రమే మంచినీళ్లు ఇవ్వడం తో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ కు ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ కు శుక్రవారం ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మచిలీపట్నం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో బాలాజీ మాట్లాడారు. మచిలీపట్నంలో ప్రభుత్వాలు మారిన నాయకులు మారిన నగర ప్రజలు ఇబ్బందులను ఎవరు మార్చలేకపోతున్నారని బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. గత 15 సంవత్సరాలుగా మచిలీపట్నం ప్రజలు ప్రతినెల మంచినీటి టాక్సును 30 రోజులకు చెల్లించిన 15 రోజులు మాత్రమే రోజుకు 40 నిమిషాలు మంచినీరు సరఫరా చేస్తూ ప్రజలను ఇబ్బంది పరు-స్తున్నారని బాలాజీ తెలియజేశారు. కమిషనర్లు మారిన కలెక్టర్లు మారిన మంచినీటి సమస్యలే గాని రోజు విడిచి రోజు ఉదయం 6 గంటల నుండి ఏడు గంటల వరకు విధించే విద్యుత్ కోతలు మీద గాని ఎవరు చర్య తీసుకోపోటం అధికారుల నిర్లక్ష్యానికి తార్కానమని బాలాజీ అన్నారు. 40 సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే పేర్ని కృష్ణమూర్తి గారు ఏర్పాటుచేసిన తరక టూరు మంచినీటి స్టోరేజ్ ట్యాంక్ నేటి ప్రజలకు అవసరాలు సరిపోవడం లేదని బాలాజీ అన్నారు. మచిలీపట్నంలో వ్యక్తిగత రాజకీయాలకే సమయం సరిపోతుందని ప్రజల అవసరాలు తీర్చేటువంటి నాయకుడు కరువేయడని బాలాజీ అన్నారు. తరకటూరు సమ్మర్ స్టోరేజ్ నుండి పెడన మచిలీపట్నం రూరల్ ప్రాంతాలకు కూడా నీటి సరఫరా చేయటం వలన మచిలీపట్నం నగర ప్రజలు మంచినీటికి విద్యుత్ కోతకు బలవుతున్నారని బాలాజీ అన్నారు అటు అధికార పార్టీ గానీ ఇటు ప్రతిపక్ష పార్టీ గానీ ప్రజలకు జీవితంలో అవసరమయ్యే మంచినీరు విద్యుత్ కోతపై పెదవి ఇప్పటికపోవడం శోచనీయమని బాలాజీ అన్నారు. బందరు పోర్టు అభివృద్ధి పరచడానికి ముందుగా మచిలీపట్నం ప్రజలకు మంచినీటి సమస్యను తీర్చవలసిన అవసరం ఎంతైనా ఉందని బాలాజీ అన్నారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని గత 15 సంవత్సరాలుగా మచిలీపట్నంలో ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు విధిస్తున్న విద్యుత్ కోతలు తొలగించాలని కార్పొరేషన్ వసూలు చేసే 30 రోజుల మంచినీటి పన్నుకు ప్రజలను 30 రోజులు మంచినీళ్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని బాలాజీ డిమాండ్ చేశారు. తక్షణమే మంచినీటి కొరత తీర్చడానికి మచిలీపట్నానికి అదనపు వాటర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలని అందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని బాలాజీ కోరారు.

# ఎంపీకి డివిజన్ల విభజన వివరిస్తున్న జనసేన నగర అధ్యక్షుడు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరికి నగరపాలక సంస్థ 60 డివిజన్ల విభజనను వివరిస్తున్న జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు మచిలీపట్నం నగరపాలక సంస్థ 60 డివిజన్ల విభజన నమూనాను అలాగే బూత్ ల జాబితాను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి దృష్టికి ఇంచార్జ్ బండి రామకృష్ణ సమక్షంలో విభజనలో ఓటర్ల వ్యత్యాసం ఉందని 15 డివిజన్ లు 1200,నుండి 1700 ఓట్లు గా విభజించారని 45 డివిజన్ లు 3000 వేల లోపు గా విభజన జరిగిందని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు పార్లమెంట్ సభ్యులు బాలాశౌరి కి వివరించారు జనసేన పార్టీ డివిజన్ ఇన్చార్జులు వార్డుల విభజన పట్ల పలు సమస్యలను బాలశౌరి దృష్టికి తీసుకువచ్చారు బూత్ ల ప్రకారం విభజన వల్ల స్థానిక సంస్థల ఎన్నికలకు ఇబ్బందులు వస్తాయని 50 డివిజన్ లు 60 డివిజన్లుగా రూపాంతరం చెందినప్పుడు కొత్తగా డివిజన్లు ఏర్పాటు చేసి ప్రతి డివిజన్ కు సమాన ఓట్లు ఉండేలా బూత్ ల ఏర్పాటు ఉండాలని తెలిపారు స్పందించిన బాలసౌరి జిల్లా కలెక్టర్ తో మాట్లాడతానని పూర్తిస్థాయిలో అధికారులు అధికారికంగా ప్రకటించిన తర్వాత నివేదిక రూపొందించి జిల్లాకలెక్టర్ అందజేయమని జనసేన పార్టీ ఇన్చార్జిలకు తెలిపారు.

# అన్ని ప్రయోజనాలు అగ్రవర్ణాల్లోని పేదలకి అందాలి

–బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఈ బీ సీ జేఏ సీ చైర్మన్ వల్లపరెడ్డి రవీంద్ర రెడ్డి భేటీ



**హైదరాబాద్,కలంకౌంటర్ :** అన్ని ప్రయోజనాలు అగ్రవర్ణాల్లోని పేదలకి అందాలని వల్లపరెడ్డి రవీంద్ర రెడ్డి కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుతో శుక్రవారం తన నివాసంలో ఈ బీ సీ జేఏ సీ చైర్మన్ వల్లపరెడ్డి రవీందర్ రెడ్డి భేటీ అయ్యారు. అగ్రవర్ణ పేదల అభ్యున్నతికై కేంద్రంలో, అన్ని రాష్ట్రాలలో ఈ బీ సీ కమిషన్, ఈ బీ సీ కార్పొరేషన్, ఈ బీ సీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్ళాలని రామచంద్ర రావుని రవీందర్ రెడ్డి కోరారు. ఎస్సీ, ఎస్ టీ, బీసీ లకు కల్పిస్తున్న అన్ని ప్రయోజనాలను అగ్రవర్ణాల్లోని పేదలకి వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని రవీందర్ రెడ్డి తెలిపారు .దీనికి రామచంద్ర రావు సానుకూలంగా స్పందిస్తూ అగ్రవర్ణ పేదలను అన్నివిధాలా ఆదుకుంటామని అలాగే ప్రధాన మంత్రికి లేఖ రాస్తానని రామచంద్ర రావు హామీ ఇచ్చారు.

# నాడు కియా.. నేడు స్టెల్త్ ఫైటర్ జెట్.. అనంతకు చంద్రబాబు రిటర్న్ గిఫ్ట్: మంత్రి లోకేశ



**పుట్టపర్తి,కలంకౌంటర్ :** ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రను మార్చే బృహత్తర ఘట్టానికి పుట్టపర్తిలో అంకురార్పణ జరిగిందని, ఏఎంసీఏ (అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) ప్రాజెక్టుతో ఈ ప్రాంతం భారతదేశ రక్షణ రంగంలో కొత్త శక్తి కేంద్రంగా మారబోతోందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ద్వారా రానున్న పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా 14కి 14 స్థానాల్లో ఎన్డీఏ కూటమిని గెలిపించిందని, దానికి రిటర్న్ గిఫ్ట్‌గా ఈ ప్రాజెక్టును అందిస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. "నాడు కరవు నేలపై కియా కార్లు పరిగెత్తించిన విజనరీ చంద్రబాబు. నేడు అదే పుణ్యభూమిపై ఫైటర్ జెట్లు ఎగిరేలా చేస్తున్నది కూడా ఆయనే. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆశీస్సులతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోంది" అని ఆయన అన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం.. మంత్రి కొల్లు రవీంద్ర

## •నగరంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించిన మంత్రి





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్ర అభివృద్ధి, పరిశ్రమల విస్తరణ, ఉద్యోగాల కల్పన, ప్రజా సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బృందావన థియేటర్ పక్కన గల టీడీపి కార్యాలయంలో మంత్రి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా ఆలకించిన ఆయన వారి సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, రాబోయే కాలంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తూ పరిశ్రమలు, మౌలిక వసతుల నిర్మాణం వేగంగా కొనసాగుతోందన్నారు. ఉత్తరాంధ్రలో పోర్టులు, హైవేలు, కొత్త ఎయిర్‌పోర్టులు అభివృద్ధి చెందుతున్నాయని, ఇటీవల అర్సెలర్ మిట్టల్, గూగుల్ డేటా సెంటర్స్, రేర్ ఎర్త్ మినరల్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులు అక్కడికి రానున్నాయని చెప్పారు. అలాగే ఈస్ట్ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి చెందిన ప్రాజెక్టులు రాబోతున్నాయని వెల్లడించారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు పనులు వేగంగా సాగుతున్నాయని, క్వాంటం కంప్యూటింగ్ రంగంలో కూడా కీలక ప్రణాళికలు అమలవుతున్నాయని తెలిపారు. ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ గ్యాస్ పరిశ్రమలు, రాయలసీమలో హార్టికల్చర్, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కియా, అపోలో టైర్స్ వంటి సంస్థలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. పుట్టపర్తిలో లక్ష కోట్ల పెట్టుబడులతో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టుకు భూమిపూజ జరగడం రాష్ట్రానికి గర్వకారణమని, కేవలం 15 రోజుల్లో అనుమతులు మంజూరు కావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. అలాగే శ్రీ సిటీ, నెల్లూరు పరిసర ప్రాంతాలు, గన్నవరం, మల్లవల్లి ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు వేగంగా ఏర్పడుతున్నాయని చెప్పారు. మచిలీపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పామర్రు, గుడివాడలో ఎంఎస్ఎంఈ పార్కులకు భూముల కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. మచిలీపట్నం--రేపల్లె రైల్వే మార్గం ప్రాజెక్టు విషయంమై మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా మ్యాప్ పరిశీలించి ప్రాజెక్టుపై చొరవ చూపారని గుర్తు చేశారు. సుమారు రూ.2800 కోట్ల వ్యయంతో తొలి దశలో రేపల్లె వరకు ట్రాక్ ప్రతిపాదన ముందుకు సాగుతుండటం ఆనందదాయకమన్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి కానుందని తెలిపారు. ఈ రైల్వే లైన్ మచిలీపట్నం, అవనిగడ్డ, రేపల్లె ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో దీనిని బాపట్ల, గుంటూరు మీదుగా హైదరాబాద్ వం-కు విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, ఆర్థిక అనిశ్చితి దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. దేశ భద్రత, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని మంత్రి సూచించారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి సైకిళ్లు, ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించాలని కోరారు. వంటనూనెల వినియోగాన్ని తగ్గించడంతో పాటు ఎలక్ట్రిక్ స్టౌలు, కుక్కర్లు వాడాలని సూచించారు. బంగారం కొనుగోళ్లలో కూడా నియంత్రణ పాటించాలని అన్నారు. ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సోలార్ వినియోగం పెరిగితే విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు థర్మల్ స్టేషన్లపై ఒత్తిడి కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. "నా దేశం -- నా భద్రత" అనే భావనతో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, ఇలియాజ్ పాషా, తలారి సోమశేఖర్, కే సుశీల, సుబ్రహ్మణ్యం, పలు మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com